క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం పల్లకిసేవ గావించారు.

సీబీఐ క్లీన్‌చిట్ సోమిరెడ్డికి చెంపపెట్టు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తోటపల్లిగూడూరు : కోర్టులో ఫైళ్ల చోరీ కేసులో మంత్రి కాకాణికి సీబీఐ క్లీన్‌చిట్ ఇవ్వడం సోమిరెడ్డికి చెంపపెట్టు అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ పేర్కొన్నారు. తోటపల్లిగూడూరులో వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి కాకాణిని రాజకీయంగా ఎదుర్కోలేక సోమిరెడ్డి అపసోపాలు పడుతున్నాడన్నారు. ఈ కేసుపై రెండేళ్లుగా విచారణ సాగించిన సీబీఐ మంత్రి కాకాణి పాత్ర ఏమీ లేదని తేల్చినట్లు తెలిపారు. ఇకనైనా సోమిరెడ్డి బుద్ధి తెచ్చుకుని మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు ఎంబేటి శేషమ్మ, నాయకులు మన్నెం చిరంజీవులగౌడ్, ఆకుల మధు, టి.తిరుపతి, కె.మణి పాల్గొన్నారు.

సర్వమత ప్రార్థనలు



కసుమూరు దర్గాలో ప్రార్థనలు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటాచలం: కోర్టులో ఫైళ్ల చోరీ కేసులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎలాంటి పాత్రలేదని సీబీఐ క్లీన్‌చిట్ ఇవ్వడంతో మండలంలోని కసుమూరు దర్గా, గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. కసుమూరు దర్గాలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, సర్పంచ్ కడివేటి శివ, వైఎస్సార్‌సీపీ నేతలు చీకుర్తి నరసయ్య తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గొలగమూడిలోని వెంకయ్యస్వామి ఆశ్రమంలో మండల ఏఎంసీ చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ శీనమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు ఎం.నరసయ్య, మనోహర్, కిరణ్, అన్నపరెడ్డి శీనయ్య, ఉడతా శీనయ్య తదితరులు ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష



ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం అని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. అనంతరం పలువురికి ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ అహ్మద్, ఎంపీడీఓ రామాంజనేయులు, ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ, సచివాలయ కన్వీనర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నాన్‌డెల్టాకు ఢోకా లేదు

- దక్షిణ కాలువ కింద నీటి విడుదల
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ

పొదలకూరు: సోమశిల ప్రాజెక్టులో నీటి నిల్వ తక్కువగా ఉన్నందున నాన్‌డెల్టా రైతులు మెట్ట పంటలను సాగు చేస్తున్నారు. అయితే వాటికి నీటిని విడుదల చేయాల్సిందిగా మండలంలోని రైతులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కోరగా ఆయన వెంటనే స్పందించారు. ఫలితంగా సోమశిల అధికారులకు తగిన ఆదేశాలిచ్చారు. దీంతో మంగళవారం అధికారులు కలువాయి మండలం వెదనపర్తి చెరువు (రిజర్వాయర్) నుంచి దక్షిణ కాలువ దిగువ భాగానికి నీటిని విడుదల చేశారు. ముందుగా 200 నుంచి 250 క్యూసెక్కులను విడుదల చేసి తర్వాత అవసరాన్ని బట్టి పెంచుతామని సంబంధిత అధికారులు వెల్లడించారు. బుధవారం సాయంత్రంలోగా దక్షిణ ప్రధాన కాలువ ద్వారా 26ఎల్ కాలువ నుంచి నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, బత్తులపల్లి తదితర గ్రామాలకు నీరు అందుతుందని సోమశిల చేజర్ల సబ్‌డివిజన్ ఏఈ సుధాకర్ వెల్లడించారు. రైతుల అవసరాన్ని పరిశీలించి ఎన్నిరోజులు నీటిని విడుదల చేయాలో నిర్ణయం తీసుకుంటామన్నారు. నీటిని విడుదల చేయించిన మంత్రి కాకాణికి ఆయా గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలిపారు. దీంతో నాన్‌డెల్టా సాగుకు ఢోకా లేకుండా పోయింది.



సోమశిల దక్షిణ కాలువలో పారుతున్న నీరు

తాగునీటి పథకానికి ఎన్‌ఎస్సార్ పేరు



నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు చేపట్టిన పథకానికి దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి రక్షిత తాగునీటి పథకంగా నామకరణం చేశారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జీఓ జారీ చేసింది. ఈ పథకానికి నల్లపరెడ్డి శ్రీనువాసులురెడ్డి నామకరణం చేయాలని ఇటీవల నగర పంచాయతీ కౌన్సిల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించింది. దీనిని పరిశీలించిన ప్రభుత్వం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. రూ.85 కోట్లతో సంగం నుంచి పైప్‌లైన్ ద్వారా నిర్మించనున్న ఈ పథకం ద్వారా నగర పంచాయతీ పరిధిలో 10 వేలకు పైగా కుళాయి కనెక్షన్లను ఇవ్వనున్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న తాగునీటి పథకానికి ప్రభుత్వం తన తండ్రిపేరు పెట్టడం చాలా సంతోషంగా ఉందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తన తండ్రి సేవలకు గుర్తింపు ఇచ్చినందుకు ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని వివరించారు.

దిగజారుడు రాజకీయాలు మానుకో

- సోమిరెడ్డికి వెంకటశేషయ్య హితవు



సర్వేపల్లి ఈఆర్వోతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటశేషయ్య

వెంకటాచలం: సోమిరెడ్డి ఇకనైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య హితవు పలికారు. వెంకటాచలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్‌ఓ) చిన్న ఓబులేసును వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. వెంకటాచలంలో దొంగ ఓట్లు ఉన్నాయనే తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణికి ఉన్న ప్రజాదరణను చూసి సోమిరెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, మరోదఫా ఓటమి పాలైతే రాజకీయ భవిష్యత్తు సమాధి అవుతుందనే ఆందోళనతో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. వెంకటాచలంలో దొంగ ఓట్లు ఉన్నాయనే ఫిర్యాదుపై అధికారులు విచారించి ఒక్క దొంగ ఓటు లేదని నిర్ధారించారన్నారు. అయినా తప్పుడు ఆరోపణలు చేసి, ఉద్యోగుల పనులకు ఆటంకం కల్పిస్తున్న టీడీపీ చోటా నేతలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఇతర వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

గ్రామాలపై బూడిద పడగ



బలిజపాళెంలో నిలిపివేసిన వాహనాలు



గ్రామస్తులతో చర్చిస్తున్న ఎస్సై

- బలిజపాళెంలో వాహనాలకు బ్రేక్

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల నుంచి బూడిద తరలించుకుపోయే వాహనాలు మార్గమధ్యలో వచ్చే గ్రామాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. వాహనాల నుంచి జారిపడే బూడిద ముత్తుకూరు, బలిజపాళెం, కోళ్లమిట్ట, పంటపాళెం గ్రామాలను ముంచెత్తుతున్నాయి. గ్రామస్తులను బెంబేలెత్తిస్తున్నాయి. గాలికి లేచే బూడిద ఇళ్లు, దుకాణాల్లోకి చేరుతోంది. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ బాధ భరించలేని బలిజపాళెం గ్రామస్తులు మంగళవారం సుమారు 50కిపైగా వాహనాలను నిలిపివేసి, ఆందోళనకు దిగారు. దీంతో వెంకటాచలం, ముత్తుకూరు వైపు వాహనాలు బారులుతీరాయి. ఎస్సై శ్రీనివాసులురెడ్డి బలిజపాళెం గ్రామస్తులతో చర్చలు జరిపారు. వాహనాల నుంచి బూడిద జారకుండా, వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బూడిద లేవకుండా మూడు పూటల నీళ్లు చిలకరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ అంశాలను వాహనాల నిర్వాహకులతో చర్చించి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వాహనాలను విడిచిపెట్టారు.

పెట్రోల్ బంక్ స్థల పరిశీలనపై సమీక్ష



తహసీల్దార్‌లో మాట్లాడుతున్న పోలీసులు

కోవూరు : స్థానిక పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో పోలీస్ శాఖ ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్ కోవూరు తహసీల్దార్ విజయశ్రీతో ఆమె కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకంగా చర్చించారు. పెట్రోల్ బంక్‌కు సంబంధించిన స్థల పరిశీలన పూర్తి చేశామని వివరించారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ట్యాబ్‌లను అందజేస్తున్న హెచ్‌ఎం

కోవూరు : ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌ల ద్వారా సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని హెచ్‌ఎం నరసింహమూర్తి తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీవార్మింగ్ డేను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

మనుబోలు : నేషనల్ డీవార్మింగ్ డేను జయప్రదం చేయాలని ఎంపీడీఓ ప్రసాద్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, వైద్య సిబ్బందితో డీవార్మింగ్ డేపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో పాటు 19 సంవత్సరాల్లోపు వారందరితో డీవార్మింగ్ మాత్రలు నమిలి మింగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 19 ఏళ్ల లోపు వారు 6,671 మంది ఉన్నారని, వీరందరికీ నులి పురుగుల మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం డీవార్మింగ్ డే పోస్టర్‌ను ఆవిష్కరించి కిట్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఏఓ రవికుమార్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుల్తానా, సీహెచ్‌ఓ రాజయ్య, ఎంఈఓ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్సార్ నిధులతో అభివృద్ధి పనులు



కుర్చీలు, బరువు తూచే యంత్రాల బహూకరణ

ముత్తుకూరు : కృష్ణపట్నం పోర్టు బైపాస్‌రోడ్డులోని పామాయిల్ ఫ్యాక్టరీల సీఎస్సార్ నిధుల ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులు జరగడం సంతోషంగా ఉందని పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు అన్నారు. ట్రిపుల్ ఎఫ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్వాహకులు మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.60,000ల విలువైన కుర్చీలు, బరువు తూచే యంత్రాలు, బ్లాక్ బోర్డులు, ఎత్తు కొలిచే స్కేళ్లను మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా కోళ్లమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సభలో ఆలపాకతో పాటు ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. ట్రిపుల్ ఎఫ్ నిర్వాహకులు గతంలో రెండు బస్‌షెల్టర్లు కూడా నిర్మించారని గుర్తుచేశారు. ఫ్యాక్టరీ డీజీఎం ఫాల్గుణరావు, సునీల్‌బాబు, ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం, ఏపీఓ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ సుబ్బమ్మ, టీచర్లు మంజుల, పోలమ్మ, సుజాత పాల్గొన్నారు.

కబడ్డీ జట్టుకు అభినందన



కబడ్డీ క్రీడాకారులతో చైర్‌పర్సన్ సుప్రజ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా నియోజకవర్గస్థాయిలో సత్తా చాటి రాష్ట్ర పోటీలకు ఎంపికైన బుచ్చిరెడ్డిపాళెం కబడ్డీ జట్టును పట్టణంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మంగళవారం అభినందించారు. క్రీడాకారులను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఇదే ఉత్సాహంతో రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా గెలుపొందాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మోర్ల మురళి, విల్సన్, మల్లికార్జునరెడ్డి, కౌన్సిలర్ ప్రసాద్‌యాదవ్, పీఈటీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



సర్వేపల్లిలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వెంకటాచలం : వరిసాగులో తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పరమ శివ సూచించారు. మండలంలోని సర్వేపల్లి, ఇస్కపాళెం, నిడిగుంటపాళెం, పుంజులూరుపాడు, తాటిపర్తిపాళెం గ్రామాల్లో వరి పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. వరిసాగులో అక్కడక్కడా సుడి దోమ ఉన్నట్లు గుర్తించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం ఎలా చేస్తున్నారో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డి.విజయకుమార్ నాయక్ రైతులకు వరి సాగులో మెళకువలు వివరించారు. సుడిదోమ నివారణకు పిచికారీ చేయాల్సిన మందులు, మోతాదు తదితర వివరాలను రైతులకు అర్థమయ్యేలా చెప్పారు. రైతులు అప్రమత్తతతో వ్యవసాయం చేస్తే లాభాలు పొందుతారని తెలియజేశారు. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు లక్ష్మీమాధవి, నెల్లూరు సహాయ సంచాలకుడు శ్రీనివాసులు, మండల వ్యవసాయ శాఖాధికారి డి.హరికరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆడుదాం.. ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన సర్వేపల్లి నియోజకవర్గ క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన సొంత నిధులతో అందజేశారు. పొదలకూరు రోడ్డులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నగదు ప్రోత్సాహకాలను మంత్రి కుమార్తె పూజిత ఇచ్చారు. మహిళా క్రికెట్‌లో ప్రథమ స్థానం సాధించిన కసుమూరు సచివాలయ జట్టుకు రూ.50 వేలు, వాలీబాల్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన తోటపల్లిగూడూరు మండలం కోడూరు – 1 సచివాలయ మహిళా జట్టుకు రూ.30 వేలు, పురుషుల బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం సాధించిన పొదలకూరు జట్టుకు రూ.30 వేలు, క్రికెట్‌లో తృతీయ స్థానంలో నిలిచిన ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పురుషుల జట్టుకు రూ.20 వేల చొప్పున రూ.1.3 లక్షలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విశాఖపట్నంలో నిర్వహించనున్న ఆడుదాం.. ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపాలని కాంక్షించారు.

ఇంటింటికీ ఆరోగ్యశ్రీ కార్డులు



ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న వలంటీర్, ఏఎన్‌ఎం

కొడవలూరు : మండల కేంద్రమైన కొడవలూరులో మంగళవారం ఇంటింటికీ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల వరకు దేశంలో ఎక్కడైనా వైద్య చికిత్సలు పొందే వెసులుబాటు కల్పించడం తెల్సిందే. దీంతో నూతనంగా ముద్రించిన కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందించారు. అయితే ఆ సమయంలో కార్డులు పొందలేని వారికి వలంటీర్‌తో పాటు వైద్య సిబ్బంది కలిసి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామానికి తొలి విడతగా 943 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరైందని, వీటన్నింటినీ మంగళవారం అందజేయడం ద్వారా వంద శాతం పంపిణీ పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుభాషిణి, వలంటీర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీలు



కొడవలూరు గిరిజన కాలనీలోని పాఠశాలలో వర్క్‌బుక్‌లు పరిశీలిస్తున్న ఎంఈఓ

కొడవలూరు : మండలంలోని టపాతోపు, కొడవలూరు గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ జి.వసంతకుమారి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల వర్క్‌బుక్‌లు, నోటు పుస్తకాలను పరిశీలించడంతో పాటు తరగతికి ఒక విద్యార్థిని పిలిచి పలు ప్రశ్నలు అడిగి సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసి సకల వసతులు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు విద్యాపరంగా వెనుక బడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఏ విద్యార్థికైనా తరగతికి తగ్గ సామర్థ్యాలు లేకపోతే పాఠశాల హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆమె వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎం.సరస్వతి, డీవీ.సరోజ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పంట నమోదును వేగవంతం చేయాలి

కొడవలూరు: మండల పరిధిలో పంట నమోదును వేగవంతం చేయాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం, గండవరం ఆర్బీకేలను ఆమె మంగళవారం సందర్శించి పంట నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమం అనేక ఆర్బీకేల్లో మందకొడిగా సాగుతోందన్నారు. ఈనెల 15లోగా వంద శాతం పంట నమోదు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించి ఉన్న నేపథ్యంలో ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

10న సామూహిక సత్యనారాయణ వ్రతం

కోవూరు : స్థానిక గాంధీపార్క్ సెంటర్‌లో ఉన్న కోదండరామ స్వామి దేవస్థానంలో ఈనెల 10వ తేదీన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అత్యంత వేడుకగా జరిగే వ్రతానికి హాజరయ్యే దంపతులు ప్రధానార్చకుడు శ్రీకాంతాచార్యుల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, అర్చకుడు శ్రీకాంతాచార్యులు పాల్గొన్నారు.